
నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 25



**రా**మకోటి అంటే మంచి కథల చిరునామా. రామకోటి అంటే మనిషి పక్షాన నిలిచే మంచి రచయిత. రామకోటి అంటే పురాణేతిహాసాలను సాంగోపాంగంగా చదివి జీర్ణించుకున్న విజ్ఞాన ఖని. సమాజ అధ్యయనంతోపాటు సకల సంకటాలతో సత మతమవుతున్న మనుషుల్నీ, బడుగు జీవుల దరిద్ర జీవనాన్ని చదివి కదిలిపోయే మానవత్వమున్న మనిషి. అందుకే మనసు కలుక్కు మన్నప్పుడల్లా కథలు రాసానన్నారా యన. శ్రీశ్రీ, ఆరుద్ర, రా.వి.శాస్త్రి, రోణంకి అప్పలస్వామి వంటి మహామహులు సమకాలి కులు కావడం, వారితో సహజీవనం చేయడం తన మహద్భాగ్యం అంటారు రామకోటి. వారి సాహచర్యం మార్గ నిర్దేశం తనను మంచి రచ యితగా తీర్చి దిద్దాయని భేషజం లేకుండా చెబుతారాయన. **2009** సంవత్సరానికి రా.వి.శాస్త్రి పురస్కారం అందుకోవడం రచ యితగా 'భారతరత్న' కంటే గొప్ప అవార్డు అని నిస్సంకోచంగా చెప్పిన యం.రామకోటితో ఈ వారం ఇంటర్వ్యూ.

# అనాథలు, అభాగ్యులే నా కథా వస్తువులు

**- యం. రామకోటి**

### బాల్యం బంగారుప్రాయమే!

గొప్ప జమీందార్లుగా చెప్పుకోకపోయినా గొప్పింటి బిడ్డగానే తూర్పుగోదావరి జిల్లా పుట్టకొండ అగ్రహారంలో 1931లో మట్టపల్లి పేరిందేవి తాయారమ్మ, చినవేంకట రమణయ్యలకు ఏకైక సంతానం నేను. నాన్నగారు సంస్కృత పండితులు. అమ్మది విజయనగరం. తెలుగు, సంస్కృతం రెండూ వచ్చు. ఆర్థికంగా ఇబ్బందుల్లేని కుటుంబం. అమ్మ గోరుముద్దలతో పాటు గోవింద నామాలు, శ్రీరంగనాయకి తమిళపదాలు, తరంగాలు, అష్టపదులు రంగరించి తినిపించింది. చిన్నప్పటి నుంచే గ్రంథ పఠనం పట్ల ఆసక్తి పెంచింది. ఏయే గ్రంథాలు చదవాలో నాన్నగారు సూచించి సందేహాలు తీర్చేవారు. సాహిత్య రంగ ప్రవేశం చేయించింది తునిలో చల్లా పాపయ్య శాస్త్రిగారు. ఆయనే నా ఆది గురువు. అక్కడి సంస్కృత పాఠశాలలోని భవానిభట్ల సుబ్బారావు, నల్లాన్ చక్రవర్తుల నారాయణరావుగారు సాహిత్యం వైపు నడిపించారు. సంస్కృత, ఆంగ్ల సాహిత్యాలను పరిచయం చేశారు. ఇంటర్ కాకినాడలో చదివాను.



...పూడి మారుతీరావుతో...

## నచ్చినవి

| | |
|---|---|
| కథలు | : ఎంపు, వాయులీనం (చా.సో) |
| నవల | : అల్పజీవి (రావిశాస్త్రి) |
| కవులు | : శ్రీశ్రీ, ఆరుద్ర |
| రచయిత | : రావిశాస్త్రి |
| సినిమా | : వేమన (నాగయ్య గారు నటించింది) |
| నటుడు | : ఎస్వీ రంగారావు |
| నటి | : సావిత్రి |
| గాయకుడు | : ఎస్.రాజేశ్వరరావు |
| గాయని | : ఎస్. జానకి |
| స్నేహితుడు(లు) | : ఉన్నారని భ్రమ పడను. సన్నిహితులు చాలామంది ఉన్నారు. హితులు లేరు. |
| ఇష్టమైన వంట | : చక్కెర పొంగలి |
| నచ్చిన పాట | : అందాలు చిందేటి నా జ్యోతి తొలికారు మబ్బుల్లో తొంగి చూసే జ్యోతి (వేమన సినిమాలోనిది) ఈ పాట ఎంత ఇష్టమంటే 'జ్యోతి'పేరుతో ఓ నవల కూడా రాసాను. |

### ఊరు మారాను - తీరు మారింది

విశాఖ జిల్లా యలమంచిలిలో మూడు సంవత్సరాలు ఉన్నాం. ఆరుద్రతో అక్కడే పరిచయం అయింది. ఆయన నన్ను 'ఒరేయ్! రామా!' అని పిలిచేంత ఆప్యాయతా పెరిగింది. శ్రీశ్రీ నన్ను 'తంబీ' అనేవాడు. అది ఆరుద్ర 'త్వమేవాహం' రాస్తున్న రోజులు. ఆ అక్షర సమూహాన్ని నాకు ఆయన నోటంట వినే భాగ్యం కలిగింది. అనంతరం విజయనగరం మహారాజా కళాశాలలో డిగ్రీ చదువు. అప్పుడే చా.సోని పరిచయం చేసుకోమని ఆరుద్ర సూచించారు. పరిచయం చేసుకొని చాసోకి దగ్గరయ్యాను. ఆయన అభిమానం పొందగలిగాను. అక్కడే రోణంకి అప్పలస్వామి గారి శిష్యరికం లభించింది. ఆ మహానుభావుడు జర్మన్, ఇటాలియన్ భాషలలోని సాహిత్యం రుచి చూపించి ఆశీర్వదించారు. వారి మార్గదర్శకంలో ప్రాక్, పశ్చిమ సాహిత్యాలను అధ్యయనం చేయగలిగాను. అందుకే నా 'రసధ్వని' గేయ సంపుటాన్ని ఆయనకే అంకితమిచ్చాను.

### తొలి కథ 'నల్లని వాడు'

'నల్లని వాడు పద్మనయనంబులవాడు...' ఈ పదాన్ని ఓసారి రావిశాస్త్రి ముందు రాగయుక్తంగా వినిపిస్తే, ఒక వ్యక్తి వర్ణనకు పోతన ఇన్ని విశేషణాలు ఎందుకు వాడాడు? అని ఆలోచించి ఈ 'నల్లని వాడు' పేరు మీదే ఓ కథ రాయమన్నారు శాస్త్రిగారు. నా తొలి కథ అలా రూపు దాల్చింది. అది 1960లో 'సాహితి' పత్రికలో అచ్చయింది. నన్ను కదిలించి నాచేత జనం కోసం కథలు రాయించింది రావిశాస్త్రే! లేమి, రోగం, మరణం ఈ మూడింటికి ఎవరూ అతీతులు కారు. వీటిలో చిక్కుకున్న మనుషుల జీవితానికి మించిన కథా వస్తువు ఏం ఉంటుంది?

### ఆంగ్ల సాహిత్య ప్రభావం

నాపై చాలా ఉంది. షేక్స్పియర్, ఆస్కార్‌వైల్డ్, సోమర్‌సెట్ మామ్, అంటెన్ చెకోవ్, గోర్కీ, డాస్టో విస్కీ... ఇంకా చాలామంది ప్రభావం ఉంది. గోర్కీ నవలల్లో వినయం తొణికిసలాడుతుంది. చెకోవ్ కథల్లో రాజసం ఉంటుంది.

### ఎమర్జెన్సీ చీకట్లు...

అవును. నేను 25-6-1931లో పుట్టాను. 25-6-1975లో అప్పటి ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించింది. ఇదో కాకతాళీయం కదా! దేశంలో మధ్యాహ్నపు చీకట్లు కమ్ముకున్నాయి. విశాఖలో విరసం (విప్లవ రచయితల సంఘం) సభ్యుల్ని (రావిశాస్త్రితో పాటు కొందర్ని) అరెస్టు చేసి జైల్లో వేశారు. నేను సభ్యుడ్ని కాదు కనక నన్ను అరెస్టు చేయలేదు.

రావి శాస్త్రిని జైల్లో కలిస్తే నన్ను బయట నుండి ఎమర్జెన్సీ వ్యతిరేకతను ప్రజల్లో ప్రచారం చేయమన్నారు. నేనూ మరి కొంతమందిమి కలిసి గ్రామాల్లో రాత్రుళ్లు ప్రచారం చేసే వాళ్లం. ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ ఎన్నో వ్యాసాలు రాశాను. నిర్భయంగా నా భావాలను వెల్లడించాను. 'గురి' కథ ఎమర్జెన్సీలో రాసిందే. అది రామాయణంలోని ఒక ఘట్టాన్ని సోషలైజ్ చేసి రాసిన కథ. అప్పుడు అచ్చు కాలేదు. తరువాత అచ్చయింది.

### కథలకు నేపథ్యం

ప్రజల జీవితమే! ముఖ్యంగా రోడ్ల పక్క పేవ్‌మెంట్స్ మీద బతుకుతున్న అభాగ్యజీవుల దీన గాథలు నా కథా వస్తువులు. విశాఖలో అలాంటి బతుకుల్ని చూసి కదిలిపోయి 'శకటిక' కథ రాశాను. ఒక మంచి పాట వింటే రోజంతా సంగీతప్రియుల్ని ఎలా వెంటాడుతుందో, అలాగే ఓ కథ చదివితే జీవితంలో ఒక రోజు కాదు కొంతకాలం సాహిత్యప్రియుల్ని వెంటాడాలి. ఆ కథని పాఠకుడు మళ్లీ మళ్లీ చదవాలి. అలాంటి కథలే మంచి కథలు. రచయిత్రుల్లో నాకు తెలిసి రంగనాయకమ్మ లాగా తెలుగు ఎవరూ రాయలేరు. నా కథల్లో ఒక్క సంస్కృత పదం ఉన్నా 'పురిపండా అప్పలస్వామి' ఒప్పుకొనే వారు కాదు.

### నేల మీద నడయాడే వెన్నెల్లో...

విశాఖపట్నం బీచ్ తీరంలో నా సహచరులు శ్రీశ్రీ, ఆరుద్ర, రావిశాస్త్రి తదితరుల విగ్రహాల పక్క నుంచి వెళుతుంటే నేల మీద నడయాడే వెన్నెల్లో (వెన్నెల అంటే జ్ఞానం అన్న అర్థం కూడా ఉంది) విహరించినట్లు ఉంటుంది.

### అవార్డులు - రివార్డులు...

వాటి గురించి నేను పెద్దగా పట్టించుకోలేదు. కొన్ని కథలకు బహుమతులు వచ్చాయి. బహుమతి గెల్చుకున్న నా 'శకటిక' కథ ఎంపికకు రాజమన్నార్,


కుటుంబ సభ్యులతో...


అవసరాల రామకృష్ణారావు, భరాగో

పాలగుమ్మి పద్మరాజు, కొడవటిగంటి కుటుంబరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఆ కథా చక్రవర్తుల ఎంపికలో నా కథ బహుమతి గెల్చుకోవడం అవార్డుకంటే గొప్పేకదా! నావి పదకొండు కథలు ఎం.జి.భీమారావు అన్న రచయిత కన్నడంలోకి అనువదించి పుస్తకంగా వేశారు. ఆ పుస్తకావిష్కరణ సభలో కొంత మంది రచయితలతో పాటు ప్రఖ్యాత కన్నడ రచయిత, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత శివరామకారంత్ నా పక్కన కూర్చున్నారు. ఆ సందర్భంగా నా 'కాలకూటం' కథ ఆయన మెచ్చుకోవడం నా దృష్టిలో అవార్డు కంటే గొప్పదే!

***వందేళ్ళ కథ... సంబరాలు***

సంబరాలు సమావేశాలు జరపడం మంచిదే! అయితే వ్యాపార దృక్పథంతో చేయడం నాకు నచ్చదు. అది నూరేళ్ళ పండగలా జరగాలి కానీ, కథకు నూరేళ్లు నిండేలా కాదు. కథకు మంచి భవిష్యత్తు ఉంది. మల్లాది రామకృష్ణ శాస్త్రి, చలం, శ్రీపాద, చింతా దీక్షితులు, రావి శాస్త్రి.... ఇలా ఎందరో గొప్ప రచయితలు తెలుగుకథకు చిత్రిక పట్టారు.

ఈ తరానికి కథా రచనకు మార్గనిర్దేశం చేశారు. ఆ మార్గంలో కొనసాగితేనే కథకు మనుగడ.

**-మేడా మస్తాన్‌రెడ్డి**

# సంగీత ద్వారం



**1935** ప్రాంతంలో ప్రముఖ వయొలిన్ విద్వాంసుడు శ్రీ ద్వారం వెంకటస్వామినాయుడుగారు కాకినాడ సరస్వతీ గాన సభలో, కచేరీ చేశారు. అద్భుతంగా వయొలిన్ వాయించి శ్రోతల్ని రసజగత్తులోకి తీసుకువెళ్లి నాయుడుగారు కచేరీ పూర్తి చేశారు. ఆయన అటువంటి కచేరీ అక్కడ చెయ్యడం నిజానికి, కాకినాడ శ్రోతలకీ సరస్వతీ గాన సభ నిర్వాహకులకీ పట్టిన ఒక అపూర్వమైన అదృష్టం.

కాని కచేరీ అయ్యాక, వందన సమర్పణ చేస్తూ, ఆ గానసభ కార్యదర్శిగారు, అది ద్వారం వారి అదృష్టమే అన్నట్లు మాట్లాడారు. తుమురాడ సంగమేశ్వర శాస్త్రి, పారుపల్లి, అరియక్కుడి, ఎం.ఎస్. వంటి అతిరథ మహారథులకి కూడా అరుదుగా లభించే అవకాశం – అదే, మా గానసభలో పాడడం – ఇవాళ ద్వారం వారికి లభించింది, అనే ధోరణిలో సాగింది వందన సమర్పణ.

ద్వారం వారికి కోపంవచ్చింది. తర్వాత ఆయన 'నాదో చిన్న మనవి' అంటూ ఇలా అన్నారు. ''కార్యదర్శిగారు, ఎందరో మహానుభావులు కచేరీ చేసిన పుణ్యస్థలం ఇది అన్నారు. నిజమే – ఇది ఒక గొప్ప సంగీత సౌధం. కాని ఎంతటి మహాసౌధానికైనా ద్వారం ముఖ్యం. ద్వారం లేని సౌధం నిరుపయోగం'' అన్నారు సాభిప్రాయంగా – సభాప్రాంగణం చప్పట్లతో మారుమ్రోగిపోయింది.

**కథాకళి**

# అసలైన మనిషి!



'ఇప్పుడు మీకేం కనిపిస్తోంది?' కిటికీ గుండా పడుతున్న ఎండను చూపిస్తూ అడిగాడు సైన్స్ టీచర్ పదో తరగతి పిల్లల్ని ప్రయోగ శాలలో!

'తెల్లటి కాంతి' బదులిచ్చారు పిల్లలు.

వెరీ గుడ్! అంటూ ఒక కాంతికిరణాన్ని అట్ట ముక్కగుండా తెల్లని స్ఫటికంలోకి పంపాడు టీచర్. మరోపక్కన చిన్న తెర ఏర్పాటు చేశాడు.

'తెరపై ఇప్పుడేం కనిపిస్తోంది?' మళ్లీ అడిగాడు టీచర్.

'ఏడు రంగులు!' బదులిచ్చారు పిల్లలు.

'సరే. మరో ప్రశ్న. మన చుట్టూ ఏముంది?' అడిగాడు టీచర్.

'గాలి...' బదులిచ్చారు పిల్లలు.

'వెరీ గుడ్' అంటూ గాలిలో ఏమేమి వాయువులున్నాయో తెలిపే మీటర్‌ను తెచ్చి చూపించారు టీచర్.

'గాలిలో ఏమేమి ఉన్నాయి?'

'ఆక్సిజన్, కార్బన్‌డై ఆక్సైడ్, నైట్రోజన్ మొదలైన వాయువులు!'

'ఓకే. ఇంకో ప్రశ్న అడుగుతాను. మెరుపు ముందు పుడుతుందా? ఉరుము ముందు ఉరుముతుందా?' అడిగారు టీచర్.

'రెండూ ఒకేసారి..' బదులిచ్చారు పిల్లలు.

'మరి ఏది ముందు మనకు చేరుతుంది?' అడిగాడు టీచర్.

'మెరుపు' చెప్పారు పిల్లలు.

'బావుంది. ఇప్పుడిది చెప్పండి' అంటూ మనుషుల బరువు కొలిచే యంత్రాన్ని తెచ్చాడు టీచర్. దానిపై తన చేతికున్న బంగారు ఉంగరాన్ని ఉంచారు. ముల్లు ఇసుమంతైనా కదల్లేదు.

'ఈ యంత్రం ఆధారంగా నా ఉంగరం బరువెంతో, అది ఎన్ని గ్రాములు తూగుతుందో, దానికి ఎన్ని రూపాయలో చెప్పగలరా?' అడిగాడు టీచర్.

'చెప్పలేం' అన్నారు పిల్లలు.

'ఎందుకు? బంగారు ఉంగరానికి బరువులేదా? దానికి విలువ లేదా?'

తెల్లమొహం వేశారు పిల్లలు!

***నీతి:*** మన కంటికి ఒకే తెలుపు రంగులో కనిపించే కాంతిలో సప్త వర్ణాలున్నాయి. మన కంటికి అసలే మాత్రం కనిపించని గాలిలో అనేక వాయువులున్నాయి. మెరుపు ముందు మనకు కనిపించినా అది ఉరుముతో పాటూ పుట్టిందే. మన బరువు కొలిచే యంత్రం తూచలేకున్నా బంగారు ఉంగరం విలువైనదే! అంటే ఏమిటి? పేరుకు మనకు జ్ఞానేంద్రియాలు ఉన్నా అవి అన్నిసార్లూ నూటికి నూరుశాతం నిజమైన అవగాహన కల్పించవు. అందువల్ల వాటినే నమ్మి నిర్ణయాలు తీసుకోవడం ఎంతమాత్రం తగదు. పూర్తి సత్యబద్ధమైన అవగాహన కావాలంటే చూపుకు నైపుణ్యాన్ని అందించే స్ఫటికమో, స్పర్శకు లోతుపాతుల్ని పట్టించే వాయు విభాజక పరికరమో కావాలి. అదే సమయంలో ఆ పరికరం సదరు ప్రయోగానికి పూర్తిగా సరిపోయేదై ఉండాలి. బంగారాన్ని తూచాలంటే దాన్ని తూచగల త్రాసే ఉపయోగించాలి తప్ప మనుషుల బరువు కొలిచే యంత్రం కాదు. మనుషుల జ్ఞానేంద్రియాల పరిమితుల్ని సరిచేసేదే అంతర్‌దృష్టి, వివేకం! ఈ ఆత్మజ్ఞానాన్ని సాధించిన వాడే అసలైన మనిషి!!

**- తిగుళ్ళ కృష్ణమూర్తి**

## నాకు నచ్చిన నా కథ

# కాలకూటం

- యం. రామకోటి

**ఒంటిగంటయినా ఎండ పొడ లేక మబ్బులు కమ్మి మసాబుగా ఉంది. అర్జెంటు ఉత్తరాలు స్టెనోకి చెప్పి బద్ధకంగా ఉండి సిగరెట్ ముట్టించి ఫైల్సు తిరగేస్తున్నాను. మెంథాల్ టిప్‌లోంచి సిగరెట్ పొగ కూడా మంచుమీద గాలిలా జివ్వు జివ్వు మంటోంది. కాగితాలు తిప్పుతున్నానే గాని ఒక్క ముక్క బుర్రకు ఎక్కడం లేదు. లంచ్‌టైమ్ అయింది. ప్రక్కనే ఉన్న నాలుగంతస్తుల ఊర్వశిలో మెచ్చబడాలనిపించి ఫైల్సు మూసి బయలుదేరాను.**

**ఆమ్లెట్టూ, ఫిష్ కట్లెట్టూ, కాఫీ తెమ్మని బేరర్‌తో చెప్పి టేబుల్ మీద ఉన్న పేపరు తిరగేస్తున్నాను.**

బందోబస్తుగా సూట్లూ, బూట్లూ, నెక్‌టైలూ బిగించి, పాగాలు సర్దుకుంటూ, గడ్డాలు దువ్వు కుంటూ సర్దార్జీలూ, కోట్లు విప్పి కుర్చీల వీపులకి తొడిగి టై పిన్నులు సర్దుకుంటూ, కావలసినవి మెనూలమీద పెన్సిలుతో టిక్కులు పెడుతూ ఊళ్లో కర్మాగారాలూ, కంపెనీలు నడిపే విదేశీయులూ, ఒక భుజం మీద కెమేరా, మరొక భుజం మీద ట్రాన్సిస్టరూ వేలాడించుకుని టేబులు చుట్టూ చేరి మోచేతుల మీద వంగి మెటికలు విరుచుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్న టూరిస్టులూ, మంత్రి గారితో మంతనాలు జరిపే మిషతో హైదరాబాదు బయలుదేరే ముందు ఎవరి డబ్బుతోనే దాహం తీర్చుకునే ఖద్దరు కండువాలూ, పెద్దపెద్ద వాళ్లతో భుజాలు రాపాడించి పనులు జరిపించే మధ్యవర్తులూ... అన్నిరకాల వాళ్లతోనూ డైనింగ్ హాల్ కిటకిటలాడుతోంది. సోడాసైఫన్ బుస బుసలూ, గాజుకప్పుల ఒడిలో ఐస్ ముక్కల కిలకిలలూ, టేబుల్స్ మధ్య ఇరుకుదార్లతో అతి సున్నితంగా మెలికలు తరిగి ఒకరినొకరు తప్పించుకునే బేరర్లూ, వాళ్ల చేతులమీద ట్రేలలో ఒయ్యారాలు తిరిగే విస్కీ, జిన్, బీర్ సీసాలూ... అంతా మహేంద్రజాలంలా ఉంది. ఆకుపచ్చని వెలుగు, ఆకు మాటు గుసగుసలా జాజ్ సంగీతం హమ్మింగూ... ఊర్వశి పైట చెంగు రెపరెపల్లో జారిపడ్డ స్వర్గంలా ఉంది.

ఈ పెద్ద హోటళ్లలో చెప్పిన గంటకిగాని ఏదీ ఊడిపడదు. తోచక కౌంటర్‌దగ్గర లాడ్జర్స్ బోర్డు చూస్తున్నాను. 'జయరాం, క్రాంతి ఇండస్ట్రీస్, మద్రాసు' కంటబడింది. పరిచయం ఉన్న పేరని పించి కౌంటర్ దగ్గర రిజిస్టర్ చూశాను. సందేహం లేదు అతనే.

జయరాం, నేను ఒక ఏడాదిపాటు యూనివర్సిటీ హాస్టల్లో రూమ్‌మేట్స్‌గా ఉన్నాం. పది నిమిషాల్లో తిరిగి వస్తానని బేరర్‌తో చెప్పి పక్కనేఉన్న లిఫ్ట్ ఎక్కాను. రూమ్ తలుపుమీద – 'ఎంగేజ్డ్.. డోన్టు డిస్టర్బ్' అని ఎర్రగా నియాన్ దీపాల అక్షరాలు వెలుగుతున్నాయి. పడుకున్నా డేమో, వెళ్లనా మాననా అని ఒక్క క్షణం సందేహంలో పడ్డాను. కాని, తలుపు కొంచెం ఓరగా జారేసి ఉంది. ఫరవాలేదను కొని – "మే ఐ కమిన్... మిస్టర్ జయరాం?" అని నెమ్మదిగా తలుపు మీద కొట్టాను.

"హు ఈజిట్?... వెయిట్ ప్లీజ్" అంటూ హడావిడిగా పైకి వచ్చాడు జయరాం.

నన్ను చూసి ముందు పోల్చుకోలేక ఒక్క క్షణం తెల్లబోయి వెంటనే గుర్తు తెచ్చుకుని– "హలో ... మీరా! .... మారిపోయారే!... బాగా లావెక్కారు... పోల్చలేకపోయాను సుమండీ... కమిన్, కమిన్" అంటూ కంగారుపడుతూ వదులుగా జారిపోతున్న లుంగీ బిగించుకుని, "రండి, రండి" అని కొంచెం మొహమాట పడుతూ, ఇబ్బందిగా మొహం పెట్టి తలుపు బారగా తీసి నాకు దారి ఇస్తూ పక్కకి తప్పుకున్నాడు.

నాకేదో అసహజంగా అనిపించి, "ఏం లేదు, జయరాం... మీ పేరు బోర్డు మీద చూశాను... చాలా రోజులైపోయింది కదా మనం కలిసి... పోనీ... రూమ్‌లో ఉంటే ఓమారు పలకరించి పోదాఁవని వచ్చాను... అంతే..." అని క్షమాపణగా నానుస్తూ గదిలో అడుగు పెట్టాను.

"ఓ.... వెరీవెరీ కైండాఫ్ యూ... మీరిక్కడే ఉన్నట్టు నాకు తెలీదు... నేనే వద్దును" అని కలవర పడుతూ అడ్డదిడ్డంగా కుర్చీలు సర్దుతున్నాడు.

ఫోమ్ రబ్బరు పరుపుల మంచాలు రెండూ చేర్చి ఉన్నాయి. చీర కుప్పలా పడి ఉంది. బాత్ రూమ్‌లో లైటు వెలుగుతోంది. కొళాయి జింయిజింయి మంటోంది. ఆడవాళ్లున్నారని పోల్చుకుని, "సారీ... ఆడ్ టైమ్.... మళ్లీ వస్తాను" అని నొచ్చుకుంటూ లేవబోయాను.

"అబ్బే.... ఏం లేదూ... నథింగ్... నా మిసెస్సూ..." అని నీళ్లు నమిలి ఒక్క క్షణం ఆలోచించి చిన్న నవ్వు నవ్వుతూ, "అందాక బాల్కనీలో కూచుందాం, రండి" అని జయరాం వరండా మీదకి రెండు కుర్చీలు ఈడుస్తున్నాడు.

"లంచ్ అవర్ కదా.... వేగం పోవాలి. వస్తా... డోన్ట్ వర్రీ యువర్ సెల్ఫ్" అని వెళ్లిపోబోతున్నాను.

"అదేఁవిటండీ? ఆఫ్టర్ వెరీ లాంగ్‌టైమ్ కలుసుకున్నాం... రండి, సార్, కూచుందాం" అంటూ నన్ను కదలనివ్వలేదు జయరాం.

బాల్కనీలో కుర్చీలు వేసుకుని పిట్టగోడకి కాళ్లు తన్నిపెట్టి కబుర్లు చెప్పుకుంటున్నాం. 'క్లిక్'మని రూమ్ తలుపు మూసుకుంది. ఫ్రెండ్సూ, క్లాస్‌మేట్సూ, హాస్టల్లో నల్లులూ, పైకొస్తే ప్రొఫెసర్లూ... అన్నీ జ్ఞాపకం తెచ్చుకుని మాట్లాడుకున్నాం. పాత జోకులు గుర్తొచ్చి నవ్వుకుంటున్నాం. నాతో మాట్లాడుతున్నాడే గాని జయరాం దృష్టి అంతా రూమ్‌వేపే ఉంది.

"ఏఁవండీ... నేను వెళుతున్నాను... ఓమారిలా వస్తారా?" పిలుపొచ్చింది. రూమ్ తలుపు ఓరగా తెరుచుకుంది.

"జస్టేమినిట్... వచ్చేస్తానుండండీ" అంటూ దిగ్గున లేచి రూమ్‌లోకి వెళ్ళాడు జయరాం.

రెండు నిమిషాల తరువాత చిల్లర నోట్లు లెక్కబెట్టుకుని పర్సు చొక్కా జేబులో పెట్టుకుంటూ – "ఆఁ... అబ్బే ఏం లేదూ.... ఊళ్లోకి వెళుతుందట... రండి, మనం రూమ్‌లో కూచుందాం" అని వస్తూనే కుర్చీ ఎత్తి పట్టుకున్నాడు.

పెద్ద ఉద్యోగం చేస్తూ పెద్ద సొసైటీలో తిరుగుతున్నాడు. పెద్దపెద్ద హోటళ్లలో బస చేస్తున్నాడు. పెళ్లాన్ని పరిచయం చేస్తాడేమోనని చూస్తున్నాను. రూమ్ తలుపు తెరుచుకుని, తల వంచుకుని కుచ్చెళ్లు సర్దుకుంటూ బయటికి వచ్చిందావిడ. భుజం మీద జారిపోతున్న పైట సవరించుకుంటూ యథాలాపంగా మావేపు చూసింది. గతుక్కుపడి కళ్లు పెద్దవి చేసి రెపరెపలాడించింది.

ఎక్కుపెట్టిన కనుబొమ్మల్లోంచి దూసుకొస్తున్నట్టున్నాయా చూపులు. వలలో పడ్డ చేప పిల్లల్లాగ గిలగిల తన్నుకున్నాయి. ఓపిక లేక, ఊపిరాడక దిగాలుపడి వాలిపోయాయి. నా కళ్లు జిగేలుమని చీకట్లు కమ్మాయి. గుండె దడదడలాడింది. కళవళ పడ్డాను. చూస్తే బాగుండదని వెంటనే తెప్పరిల్లి తమాయించుకుని జయరాం మొహంలోకి చూశాను. కొంచెం తడబడుతూ మాటల్లోకి దింప బోతున్నాడు.

తల దించుకుని తప్పటడుగులు వేసుకుంటూ, బాల్కనీలో కంగారుగా నడుచుకుంటూ మేడ మెట్లు దిగి పోయిందావిడ. నా తల తిరిగిపోతోంది. వెంటనే వెళ్ళి

పోతే బాగుండదని మర్యాద కోసం అయిదు నిమిషాలు ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పి, ఆఫీసుకు టైమైపోతోందని వంకబెట్టి జారుకున్నాను. లిఫ్ట్ మాట మరిచి పోయి నేనూ మెట్లు దిగి ఒక్క ఊపులో నా టేబిల్ ముందు కుర్చీలో కూలబడ్డాను. నన్ను చూడగానే బేరర్ అన్నీ వేరువేరు ప్లేట్లలో నీటుగా అమర్చి, పెప్పరూ సాల్టు సీసాలూ అందుబాటులో ఉంచి, ఫోర్కు నైపూ నా చేతికి అందించాడు. విషం లాగ కాఫీ డికాక్షను కడుపులో సలసల మరుగుతూంటే, ముక్కులోంచి నా మీద పొగలు కక్కుతూ నన్ను చూసి వెక్కిరిస్తోంది టేబిలు మీద పింగాణీ పాట్.

ఆవిడ జయరాం మిసెస్ కాదు – శకుంతల. నాకు తెలుసు – శకుంతలే. రొట్టి ముక్కల్లోకి ఫోర్కు ముళ్లు దిగబడిపోతున్నాయి. కట్లెట్‌లోకి దిగబడి పైకి రాలేక గింజుకుంటూ ఖండ ఖండాలుగా నరికి పారేస్తోంది కత్తి. టిఫిన్ కొరకబడడం లేదు. చేదు విషంలా కాఫీ గొంతు దిగడం లేదు. కోటాను కోట్ల ఆలోచనలు తరు ముకొస్తున్నాయి.

శకుంతలేనా!.... ఇలా ఎందుకు వస్తుందీ?!

స్వర్గానికీ, నరకానికీ మధ్య తెర... పూతరేకులాంటి, తూనీగ రెక్కలాంటి తెర... ఊర్వశి ఎన్నెన్నో మైకాలు కల్పించి, ఎందరెందరినో మత్తెక్కించి నాకాన్ని అల్లకల్లోలం చేసింది. ఉచ్చులలా భ్రమలు పన్ని ఈ నాటకాలకు కూడా వేదిక అవుతోందా!... శకుంతలా!.... ఇక్కడికి ఎందుకు వచ్చింది?


ఏమో!.... మనిషిని పోలిన మనిషేమో... అయితే అంతలా బెదిరిపోయిందేం? ఆ చూపూ, ఆ నడకా.... అంతా శకుంతలే... అంత పోలికా!

తలాతోక అందక ఆశ్చర్యపోతున్నాను.

"నమస్కారవండీ... బాగున్నారా?" తుళ్లిపడి తిరిగి చూశాను.

శకుంతల!

వందనంగా నిలబడి పలకరింపు కోసం చిరునవ్వు నవ్వుతూ నా మొహంలోకి చూస్తోంది. నిండుగావిడ్డ ఆ కళ్లు నీలాకాశమంత విడుపు, నిండు సాగరమంత లోతు. నా గుండెల్లో గాలం వేస్తున్నాయి. గునపాలతో పెళ్లగించేస్తున్నాయి. మధ్యపాపిట, నొక్కుల జుత్తు, పావురాయి కంఠంలా నున్నటి మెడ. నాజూగ్గా సుళ్లు తిరిగిన ముడి. అరచేయంత నలిగీ నలగని తెల్లని చామంతి చెంపకీ పైగా చెవిసందున తురిమి చూడ ముచ్చటగా ఉంది. కుంకంబొట్టూ, నల్ల పూసలూ, మంచు మాటు పొద్దులా పైట మరుగు శతమానం – అన్నీ కలిసి చూపులో నిండూ, రూపులో సొగసూ, నవ్వులో చనువూ తొణికిసలాడుతున్నాయి. గౌరవాన్ని పుంజుకుంటున్నాయి. ముగ్గురు పిల్లల తల్లి అయినా, ముప్ఫయి దాటిపోయినా రంగు మగ్గ లేదు శకుంతల, కాకదేరిన కుందనం కణికలా వయసులో నిగ్గుతేరింది. నిండుగా, అమృతభాండంలా నవ్వుతూ నా ముందు నిలబడింది. నోట మాట





## కథాంతరంగం

ఇది విశాఖపట్నంలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా రాసినది. సెక్స్ వర్కర్‌గా జీవితాన్ని గడుపుతున్న ఓ అమ్మాయిని విశాఖలోని ఓ హోటల్‌లో అరెస్ట్ చేశారు. ఆ అమ్మాయిది కలకత్తా. ఆంగ్లం అనర్గళంగా మాట్లాడగలదు. ఆమె భర్త పక్షవాతంతో మంచాన పడ్డాడు. కుటుంబాన్ని పోషించడానికి ఆ అమ్మాయి ఆ జీవితాన్ని తప్పనిసరి పరిస్థితులలో ఎంచుకుంది. ఈ నేపథ్యం తెలిసిన నేను కదిలిపోయాను. మనసు కలుక్కుమంది. న్యాయవాదవృత్తిలో ఉన్నాను కనుక, ఆమె తరపున కేసు వాదించి గెలిచి ఆమెను ఆమె భర్తకు అప్పగించాను. ఫీజు తీసుకోలేదు. తరువాత ఆమె భర్త నన్ను కలిసి కృతజ్ఞతలు తెలిపాడు. తన భార్య గురించి చెబుతూ చేతులు జోడించి 'ఆమె దేవత సార్' అని కన్నీరు కార్చాడు. 'కాలకూటం' కథ వెనక నిజం ఇదే! ఇది కథ కాదు. వాస్తవానికి నగిషీ చెక్కిన ఆభరణం.

-ఎం.రామకోటి
0891 2568881

రాక అలా చూస్తూ ఉండిపోయాను.

"ఎప్పుడొచ్చారు?... మా మీద కోపంవొచ్చిందా? ఊళ్లోకొచ్చి కూడా రావడం మానేశారూ.." అంటూ నా అవస్థ కనిపెట్టి, చనువుగా తనే పలకరించి, మాట కలుపుతూ భుజాల మీంచి పైట తిప్పి చుట్ట బెట్టుకుంది, పెదవి విరచి చిరునవ్వు నవ్వుతూ.

ఆ నవ్వుకన్న లోతుగా శకుంతల బుగ్గలు సొట్టలు పడ్డాయి. అవి కెంపుల గనుల్లా సుళ్లు తిరిగాయి. ఆ చూపులూ, ఆ నవ్వూ నా ప్రాణాలు తోడేస్తున్నాయి.

"అబ్బే!.... ఏం లేదమ్మా... ఢిల్లీ నుండి బదిలీ అయి మొన్ననే వచ్చాను... అంతా బాగున్నారా?... సాంబం ఎలా ఉన్నాడూ?... " అని తడబడుతూ లేచి నిలబడ్డాను, బుర్ర మొద్దుబారిపోయి.

"మీ దయవల్ల అంతా బాగానే ఉన్నాం" అంది శకుంతల బరువుగా.

"అలా నిలబడి పోయారేం? రండి కూచోండి... కాఫీ తాగుదురు గాని" అంటూ నా టేబిలు అడుగునున్న మరో కుర్చీ బయటకు లాగాను, శకుంతల మొహంలో రంగులు గమనిస్తూ.

'హుఁ.... రోజు కెన్నిసార్లు మింగనూ, గరళం!.... ఎలా దిగమింగమంటా రండీ?" తూచి తూచి ముక్క ముక్కా జాలిచూపులు వాలుస్తూ చిన్నగా నవ్వింది శకుంతల.

విసురు తగులుతోంది, ఎక్కడో చురుక్కుమంటోంది. పట్టుకి దొరకడం లేదు. ఏంఁవనాలో, ఏం చెప్పాలో తోచక – "పోనీ కూర్చోండి, మాట్లాడుకోవచ్చు" అన్నాను నీళ్ళు నవులుతూ.

"పిల్లలు చూస్తుంటారు, వెళ్లాలి... మరేం అనుకోకండి... వీలుచూసుకుని ఒక్క మారు వస్తారు కదూ?" అని కాలి బొటన వేలితో నేల మీద రాస్తూ పిడికిట్లో పైట చెంగు నలిపివేస్తూ చూపులు దించేసుకుంది.

"అన్ని సార్లు చెప్పాలా... నేనే వద్దాంఁవనుకుంటున్నాను..."

"థాంక్స్, వస్తానండీ... తెలుసా?... కోట వీధిలో ఉంటున్నాం... వస్తారు కదూ?" అని తల ఎత్తి నా మొహంలోకి చూసింది.

ముంపొచ్చి మునిగిపోతున్న ఏటిదిబ్బల్లా ఉన్నాయా కళ్లు. ఆలిచిప్పల్లో ముత్యాల్లాగ రెప్పల్లో చిందిన కన్నీటి బొట్లు పగిలి పోతున్నాయి. టప్‌మని రెప్ప లాడించి, చేతులు జోడించి గిరుక్కుని తిరిగి వెళ్ళిపోయింది శకుంతల.

ఆ చూపులేవో చెప్పాలని తహతహ లాడుతున్నాయి. చెప్పుకోలేక మధనపడి పోతున్నాయి. ఆ మూగ బాధ బోధపడక గాలివానకి చిందరవందరైపోయిన కారడవిలా నా మనసంతా గందర గోళమై పోయింది.

మా క్లాసులో నలుగురే ఆడపిల్లలుండే వారు. నాజూగ్గా, నవనవలాడుతూ, చురుగ్గా, మెరుపు తీగలా... పచ్చగా ముదిరిన చెరుకు ముక్కలా నవ్వుతూ, కవ్విస్తూ ఉండేది శకుంతల. చక్రాల్లాంటి కళ్లు చరక్‌చరక్ మనిపిస్తూ ఈడొచ్చిన కుర్రాళ్లనీ, వాడిపోని మాస్టార్లనీ తన చుట్టూ కుక్కల్లా తిప్పుకునేది. ఊళ్లోవాళ్లకి, సంతలవాళ్లకి బట్టలు కుట్టి శకుంతలని చదివించేది వాళ్ల అమ్మ. మా వీధి చివర పాడుబడిన కొంపలో మిషన్ ముందు కూర్చుని అలా కుట్టుకుంటూ ఉండేది. ఎవరింటికి వచ్చేది కాదు. ఎప్పుడూ ఎవరి ముందూ చెయ్యి చాచేది కాదు.

నేనూ, సాంబం, శకుంతలా స్కూలు ఫైనలు వరకూ మా ఊళ్లో కలిసి చదువుకున్నాం. సాంబం ఫుట్‌బాల్ గ్రిగ్ ప్లేయర్. కొంచెం మాకన్నా పెద్ద, కండలూ, గర్దనా, ఛాతీపెంచి ఆ రోజుల్లో మా మధ్య నెపోలియన్‌లా బోర విరుచుకుని మరీ తిరిగేవాడు. వాడు పలకరిస్తే చాలు మేం సంబర పడి పోయే వాళ్లం. శకుంతల పలకరించలేదని వాడు కుమిలిపోయే వాడు. ఓ రోజు సాయంత్రం ప్లేగ్రౌండ్ నుంచి తిరిగొస్తూ నేనూ, సాంబం శకుంతల ఇంటిమీదుగా వెడుతున్నాం. వీధి గుమ్మానికి జారబడి జాంపండు కొరుక్కుతింటోంది శకుంతల.

"అన్నీ నువ్వే తినేస్తావా?... మాకు కొన్ని పళ్లిద్దూ...." అన్నాడు సాంబం నిలబడిపోయి, గోడవార జామచెట్టు వేపు చూస్తు.

తెల్లబోయి చూసింది శకుంతల. నా కాళ్లు వణుకుతున్నాయి.

"చిన్న చిలక్కొట్టేనా చాలే... చిలకా!" అని మళ్లీ కంగించాడు సాంబం శకుంతల వేపు చూస్తూ.

"నీ పళ్లేవంఁయ్యేయి?... ఎవరేనా రాలగొట్టేరా?... పాపం! అందుకో!" అని సగం సగం తింటున్న జాంపండు గురిచూసి సాంబం మూతి మీద సాచి విసిరి కొట్టింది.

మూతి వాచిపోయింది వెధవకి. హనుమంతుడైపోయి మూడు రోజులు స్కూలు మొహం చూడలేక పోయాడు. ఏనాడూ ఎవరూ అనుకోలేదు. వాడు అనుకోలేదు. నాతోబాటే సాంబం స్కూలు ఫైనలు పాసయి పోయాడు. శకుంతల ఫెయిలయింది. పై చదువుల కోసం చాలా ఊళ్లు తిరిగాను. చదువు అయిపోయిం తరువాత విశాఖపట్నంలో ఉద్యోగం దొరికింది. ఒక రోజు ఆఫీసులో జిడ్డుకొట్టి సాయంత్రం ఆలస్యంగా సినిమాకి వెళ్లాను. అప్పటికే సినిమా బిగినై పోయింది. బాటరీలైటు వెలుగులో దారి తడుముకుంటూ వెళ్లి కుర్చీలో కూర్చున్నాను. పది నిమిషాలకే ఇంటర్వెల్ అని గుప్పుమని లైట్లు వెలిగాయి. ఎవరెవరొచ్చారా అని అటు ఇటూ మామూలుగా తిరిగిచూస్తూ పక్కనెవరు కూర్చున్నారా అని చూశాను. నావేపే పట్టి పట్టి చూస్తున్నాడు.

"ఏంరోయ్, సాంబం!... ఎన్నాళ్లయిందిరా?" అని వాడి భుజంమీద ఒక్క చరుపు చరిచాను, మొహం చూసి పోల్చుకుని.

"అవునా, కాదా అని చూస్తున్నాను... నువ్వేనా?" అన్నాడు సాంబం నా మొడ మీద చెయ్యి వేసి చిన్ననాటి చనువుతో దగ్గరకి లాక్కుంటూ.

ఎనిమిదేళ్లయింది వాడూ, నేను కలుసుకుని, పక్కకి తిరిగి ఏదో చెబుతున్నాడు. ఆవిడెవరా అని చూశాను.

"నేనండి... జ్ఞాపకం ఉన్నానా?" అందావిడ నవ్వుతూ "శకుంతలని... మరచి పోయారన్న మాట" అంది నేనింకా పోల్చుకోలేదని, కింద పడుకున్న పాపని భుజం మీద వేసుకుని జోకొడుతూ.

"మీరా!" అన్నాను తెల్లబోతూ, మొగుడూ పెళ్లాలు ఇద్దరూ నన్నుచూసి విరగబడి నవ్వుకున్నారు. భుజం మీద పడుకున్న పాప కూడా లేచిపోయి నా మొహంలోకి చూసి ముద్దుగా బొద్దు చేతులు చరచుకుంటూ పకపక నవ్వింది. నేను ఊరు వదిలి వెళ్లిపోయిన తరువాత వాళ్లిద్దరూ అన్నవరం పారిపోయి పెళ్లి చేసుకున్నారట.

"మీ ఆవిడేది?.... మీరొక్కరే వచ్చేరేం?" అంది శకుంతల గడుసుతనంగా గుట్టుగా మట్టూ లాగబోతూ.

"ఏదీ... ఇంకా ఆవిడ జతపడందే... రమ్మంటే ఎవరొచ్చేస్తారండీ సినిమాకేనా?" అన్నాను కొంచెం దెప్పిపొడుపుగా.

"రమ్మంటేగా..." అని కొంటెగా కళ్లతో నవ్వి, కొంచెం ముందుకి వంగి గొంతుక తగ్గించి – "చెప్పండీ...ఊఁ... నిజం చెప్పాలి మరి...ఎవర్నేనా రమ్మన్నారా?.... ఊఁ?... అడక్కుండా ఎవరొచ్చేస్తారండీ... ఎన్నాళ్లిలా?.. ఒక్కరు బిక్కుబిక్కుమంటూ బెండకాయ ముదిరినా..." అని మధ్యలో ఆగి పకపక నవ్వుతూ కొరడా విప్పింది.

"ఈ బ్రహ్మచారి ముదిరినా... అంతేనా?.... అంతలా మరీ జడాయించీకూ... జడుసుకుంటాడు గుంటడు" అని సాంబం అందుకుని ఛెళ్లుమనిపించాడు.

కడుపు చెక్కలయ్యేలా నవ్వుకున్నాం. "ఏం చేస్తున్నావురా, సాంబం?" అన్నాను అసలు విషయానికి వస్తూ... "ఈ ఊళ్లోనే పనిచేస్తున్నాను" అన్నాడు.

"ఎందులోరా!?"

''మన ఊరి శర్మగారు లేరూ?... ఆయన షిప్పింగ్ ఏజెన్సీలో''

''వాట్!... నాకూ ఈ ఊళ్లోనేరా ఉద్యోగం .... చెప్పేవు కావూ''.

''అవున్రా, తెలుసు, నిన్ను చాలాసార్లు కార్లో చూసేను. పెద్ద కంపెనీ మేనేజరు వాయె... తీరా పలకరిస్తే... పలుకుతావో పలకవో అనీ...'' నాన్చాడు సాంబం.

'పలకరించడం మానేసేవ్... ఏడవ లేకపోయేవ్... మనలో మనకి పెద్దా చిన్న ఏమిట్రా?'' అన్నాను.

సినిమా మొదలైంది మళ్లీ చూస్తున్నానే కానీ నాకేమీ బోధపడటం లేదు. ఆలోచిస్తూ కూర్చుండి పోయాను. సినిమా అయిపోయింది. పాపని భుజం మీద వేసుకుని లేచి నిలబడింది శకుంతల.

''వస్తాంరా... మా ఇంటికో మాటు రారా'' అని అడ్రసు చెప్పి బయలుదేరాడు సాంబం.

కాంటీను దగ్గర పిప్పరమెంట్లూ, బిస్కత్తులూ కొని పాపని లేపి దోసిట్లో పోశాను. మంచి నిద్రలో చిరాగ్గా లేచి గీరగా చూసింది. బూరి బుగ్గలు ఉబ్బించి లక్కపిడతలాంటి బుల్లి నోరు తెరిచింది. తింటుందేమో అనుకున్నాను. దోసిలితో నా మొహం మీద సాచికొట్టింది.

''అయ్యో, అయ్యో, నీకే (పొ)చ్చిందే'' అని నొచ్చుకుని పాప బుగ్గమీద ఓ పోటు పొడిచింది శకుంతల.

బిక్కమొహం వేసింది పాప. పడిపోయినవి ఏరుతున్నాడు సాంబం.

''తప్పదు మరి... పాపని నేనే పెళ్లాడాలి'' అన్నాను పాప బుగ్గ చిదిమి ముద్దు పెట్టుకుంటూ.

''ఇంకా నయం... చేసుకోగా చేసుకోగా... ఈ రాలుగాయినే చేసుకోవాలి'' అంది శకుంతల కూతురి వేపు చూసి మూతి తిప్పుకుంటూ.

''ఏం? ... మా సాంబంగాడి మూతి వాయిగొట్టేరుగా... మీకూతురే...'' అన్నాను చమత్కరిస్తూ.

''ఆహాఁ... అదాసంగతీ'' అని పాత సంగతి జ్ఞాపకం తెచ్చుకుని - ''ఏదీ?... మీ మూతి వాయందే మరీ..'' అని సాంబం కళ్లలోకి నవ్వుతూ చూసింది శకుంతల.

పగలబడి నవ్వుకున్నాం.

వాళ్లెక్కడో ఊరవతల మూడు మైళ్ల దూరంలో కంచరపాలెంలో ఉండేవారు. నాకేవిఁటీ? హోటలు కూడూ రూమ్‌లో మకాం తోచేది కాదు. ఆదివారం వచ్చేసరికి వాళ్లింటికి పోయేవాణ్ణి. సాంబానికి అప్పుడు పేకాట పిచ్చి పట్టుకుంది. శకుంతల కలిసిరాదని నే వెళ్లేసరికి పేషన్సు ఆడుకుంటూ కూర్చునేవాడు. 'నాకు పేకాట రాదురా, బాబూ' అంటే - ''ఎందుకు పనికొస్తావురా? ఒక ఆటా లేదు, సరదా లేదు.. ఛ ఛ... ఫుట్‌బాల్‌కి ఎలాగా పనికిరాలేదు... ఇదేనా నేర్చుకోరా... ప్రయోజకుడివవుతావు'' అని నన్ను చూసి ఎగతాళీ చేసేవాడు.


''ఆఁ.... చాలు చాలు. ఇంతోటి సౌభాగ్యం లేకపోతే ఆయనకేం లోటు. ఆయన్ని కూడా దించకండి ఆ ఊబిలోకి. అందరూ మీలాగే జూదాఁవాడాలంటారు.... ధర్మరాజులు! పెళ్లాన్నేనా ఒడ్డేస్తారు...'' అని జుత్తు విరబోసుకుని ఆరబెట్టుకుంటూ ద్రౌపదిలా చురచుర చూసేది శకుంతల.

అలాంటప్పుడు నాకు భయం వేసేది. ''చిన్నప్పటినుంచీ ఆయన చదువు ఆయనా... అంతే బుద్ధిమంతుడు... పాడు చెయ్యకండి.... జూదాలు పోకిరీ తిరుగుళ్లూ... '' అంటూ మొగుణ్ణి ఓ పోటు పొడుస్తూ పేక ముక్కలు తీసేసి వేడి వేడి పకోడీలో, బజ్జీలో మా ముందు పెట్టేది.

కాఫీ తేవడానికో, మరెందుకో శకుంతల లోపలికి వెళ్లేసరికి - ''ఏంజెల్... శకుంతల దేవతరా... ఏవుందనీ నా దగ్గరేవుందనీ నాతో వచ్చేసిందిరా?'' అని తన అదృష్టానికి పొంగిపోతూ కళ్ల నీళ్లు పెట్టుకునే వాడు సాంబం.

డబ్బుకి అప్పుడప్పుడు ఇబ్బంది పడేవాళ్లు. సాయం చెయ్యబోతే చిన్నబుచ్చుకునే వాళ్లు. నాకు ప్రాణ సంకటంగా ఉండేది. ఆ రోజుల్లోనే ఆ ఇంట్లో మరో ఉయ్యాల ఊగింది. ఆ నట్టింట మరో చిట్టడుగు చిందులేసింది.

ఢిల్లీ బదిలీ అయి వెళ్లిపోయాను. ఈలోగా షిప్పింగ్ కంపెనీలో ఏడు వేలు మాయమయ్యాయి. పేపర్లో పడింది. సాంబానికి నాలుగేళ్లు శిక్ష పడింది. దూరాభారం. పిల్లలతో శకుంతల ఏం పాట్లు పడుతూందో అని రెండు సార్లు మనియార్డర్లు పంపాను. అలాంటి మనిషి లేదని తిరిగొచ్చేసేయి. అయిదేళ్ల తరవాత మళ్లీ బదిలీ అయి విశాఖపట్నం తిరిగొచ్చాను. రాగానే భోగట్టా చేశాను. వీలు చూసుకుని సాంబాన్ని చూడ్డానికి వెళదాంవనకుంటున్నాను.




ఇలా కనబడింది శకుంతల!

ఆడది పెడదారి పట్టిందన్న నిజం ఆఖరున తెలిసేది మొగుడికేనట. తెలిస్తే ఎంత బాధపడి పోతాడో సాంబం! ఏమైపోతాడో! పూర్ ఫెలో! బాధపడ్డాను. మనసు పరిపరి విధాలపోయింది.

పదిహేను రోజుల పాటు ఆఫీసులో హైరాన పడిపోయాను. తీరిక చిక్కి 'హమ్మయ్య' అనుకుని సిగరెట్ ముట్టించి గాలిలో రింగులు రింగులుగా పొగ వదులుతున్నాను. ఫోను మోగింది, ఎవరా అని చిరాగ్గా రిసీవర్ ఎత్తాను. నా పేరు పెట్టి పిలుస్తున్నారెవరో. గొంతుక ఎక్కడో విన్నదానిలా ఉంది. నాలిక కొంకరబోతున్నట్టు

ముద్దముద్దగా హీనస్వరంలో మాట నూతిలోంచి వస్తున్నట్టుంది.

"హలో... హూ ఈజిట్ స్పీకింగ్" అన్నాను గుర్తుపట్టలేక.

"నేన్రా... సాంబాన్నీ..." అన్నాడు నా గొంతుక పోల్చుకుని.

గతుక్కుమన్నాను. సర్దుకుని – "ఏంరా... నువ్వా! అంతా బాగున్నారా... పిల్ల మేకా...." అన్నాను ఆత్రుతుగా పలకరిస్తూ.

"ఏం బాగులేరా... ఏదో ఉన్నాంలే... అవునూ, ఊళ్లోకొచ్చి కూడా రావడం మానేశావేంరా?"

మాట ఈడుస్తున్నాడు. బాధ వినబడుతూంది. నా మనస్సు చివుక్కుమంది.

"వీలు చూసుకుని ఇంకా వద్దామనుకుంటున్నాను. అప్పుడే నీకెలా తెలిసిందిరా నేను ఊళ్లో ఉన్నాననీ?!" అన్నాను ఆశ్చర్యపోతూ.

"అదేవిఁటిరా? మా ఆవిడికి కనబడ్డావట... వస్తానన్నావట..."

బిక్కచచ్చిపోయాను. శకుంతల చెప్పిందన్న మాట! ఎంతధైర్యం! 'ఏం మనిషిరా, బాబూ' అనుకున్నాను.

"ఓ... అవును. అవును – మరిచిపోయాను..." అన్నాను తడబడి మాట సర్దుకుంటూ.

"అవున్లేరా.. మేమెందుకు జ్ఞాపకం ఉంటాం?" అన్నాడు. గొంతుక చిన్నబోయింది. కష్టపెట్టుకుని నిష్ఠూరంగా అన్నాడు. అన్నాడే కాని అందులో నా మీద అభిమానం, చనువూ తప్ప మరేం లేదు.

"సారీరా, సాంబం... క్షమించు" అని నొచ్చుకుని "అడుగు పెట్టగానే పిడుగు పడిందని వైజాగ్ వచ్చీరాగానే ఆడిటర్లు తగులుకున్నార్రా... ఇన్నాళ్లూ ఊపిరి సలపక చచ్చేను...ఆ బాదర బందీలో అన్నీ మరచిపోయేను. లేకపోతే మిమ్మల్ని చూడకుండా ఉండగలనా? అవునూ.... ఎక్కడ నుంచి మాట్లాడుతున్నావూ?" అన్నాను దగ్గర్లో ఉన్నాడేమో వెంటనే వెళ్లి కలుసుకుందామని.



"మా పక్కింటి డాక్టరుగారింట్లోంచి... ఫోన్ చెయ్యకు... వాళ్లు నాకోసం కబురంపడం అదీ బాగుండదు. కోట వీధిలో ఉంటున్నాం... బేకరీ వెనకాలో గుమ్మం. నిన్ను చూడాలనుందిరా.." అని ఫోను దించేశాడు సాంబం.

మరునాడు శనివారం. వేగం ఆఫీసు మూసి జీపులో బయలుదేరాను. కోట వీధి ఏమీ మారలేదు. పావురాల గూళ్లలాంటి కొంపలు, కొంపలు కూల్చే ముఠాలు, కంకర రోడ్లు, మురికి సందులు... చిదికిపోయిన సంసారాలు, చివికిపోయిన మనుషులూ... కాలు పెడితేచాలు భారతదేశం బండారం కాస్తా బయటపడిపోతుంది. పాడుబడి సగం కూలిపోతున్న మేడ ముందు ఆగింది మా జీపు. కింద వాటాలలో ఆంగ్లో ఇండియన్లూ, కాబూలీ సాయిబులూ ఉంటున్నారు. మేడ మీద సాంబం ఉంటున్నాడు. నన్ను చూడగానే "వచ్చేవా!... ఇదిగో... శకుంతలా... ఓయ్... నిన్నే.. ఓ మారిలా రా... మనింటి కెవరొచ్చేరో చూడు..." అని పసివాడిలా కేకలేస్తూ మంచం మీంచి లేచి, ఎడమకాలు ఈడ్చుకుంటూ నా ముందుకు వచ్చి కౌగిలించుకుని నా భుజం మీద వాలిపోయాడు సాంబం.

ఎడమ పార్శ్వం మూతి కొంచెం వంకర బోతోంది. ఎడమ చెయ్యి అంతగా స్వాధీనంలో ఉన్నట్టు లేదు. వాడి వాలకం చూసి కొయ్యబారిపోయాను. కళ్లు లోతుకు పోయాయి. దవడలు పీక్కు పోయాయి. ఉక్కు భీముడు చచ్చు పీనుగై పోయాడు.

"ఇదేంరా..." అన్నాను వాణ్ణి కౌగిలించుకుంటూ.

"కరువూ పగా... అన్నీ కలిసి సాధిస్తాయిరా" అని నా భుజం మీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చేశాడు.

నా గుండె తరుక్కుపోతూంది. నోట మాట రాక వీపు మీద రాస్తూ సముదాయిస్తున్నాను.

"దయుంచి వచ్చేరే...." అంటూ చీరకొంగుతో చెయ్యి తుడుచుకుంటూ వచ్చికూర్చోమని ముక్కాలి పీట వేసి, మొగుణ్ణి చూసి – "ఛ ఛ... అలా బొత్తిగా చిన్నపిల్లాడిలా బెగిలిపోతే ఎలా చెప్పండీ? నేనుండగా మీకేం భయం?... లేవండి మరీ... ఆయన కోటంతా తడిపేస్తున్నారు" అంటూ ఆప్యాయంగా బుజ్జగిస్తూ, నా భుజం మీంచి సాంబాన్ని లేవదీసి చేయూత ఇచ్చి మంచం మీద కూర్చోబెట్టింది శకుంతల.

గోడలు చౌడుబారి పెచ్చులు ఊడిపోతున్నాయి. వెల్లలేక ఇల్లంతా పొగబట్టినట్టు మాసిపోయి వెలవెలబోతోంది. పాప పెద్దదైంది. భుజంమీద రవ్వు తీసిన గౌను తొడుక్కుని చాపమీద చదువుకుంటోంది. తమ్ముణ్ణి పక్కన కూర్చోబెట్టుకుని లెక్కలు చెబుతోంది. చంటివాడు బొమ్మ గుర్రానికి పురికోస కట్టుకుని లాగుతూ దిసమొలతో ఆడుకుంటున్నాడు.

"రాకరాక వచ్చేరు. నాకు ఇప్పుడే పని తగిలింది. చూడండి... వీధిలోకి వెళ్లాలి... వంటిల్లు చక్క బెట్టుకోవాలి... మాట్లాడుకోండి... ఇప్పుడే వస్తాను" అంటూ క్షమాపణ చెప్పుకుంటూ ఒక మారు పలకరించి లోపలికి వెళ్లిపోయింది శకుంతల.

కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి నాకు.

"ఇన్ని ఇబ్బందులు పడుతూ కూడా ఒక్క ముక్క రాసేరు కాదు. నాకేం పిల్లా జల్లా? ఇల్లా వాకిలా? నాకేం ఖర్చులున్నాయీ? నేనేం చచ్చేననుకున్నార్రా?" అన్నాను బాధపడి.

"అంత మాటన్నావు.. అదే చాలు... పది వేలు... మా బాధలు మా సంసారాలు మావి. హాయి రంగామని ఉన్నావు. నీ నెత్తిమీద కూడా రుద్దాలా..." అన్నాడు సాంబం నిస్పృహగా.

"అయితే... నువ్విప్పుడేం చెయ్యడం లేదా?"

"దొంగని... అవిటివాణ్ణి... నాకెవరిస్తార్రా ఉద్యోగం?"

"మరింత కాలమూ..." నాన్నాను.

"అదిగో... దాని చలవవల్లే బతుకుతున్నాం... మాకోసం... రాత్రనక పగలనక అడ్డమైన పనులు చేసి రెక్కలు ముక్కలు చేసుకుంటోంది... ఒళ్లు హూనం చేసుకుంటోందిరా... కట్టుకున్నందుకు నేనేం సుఖపెట్టలేక పోయినా... నాకోసం... పిల్లల కోసం... అది శకుంతల కాదురా... దేవతా.." అని నా ఒళ్లో పడి బావురుమన్నాడు.

ఇంకా వీడిదాకా రాలేదా?.... అసలే బెగిలిపోయి మానసికంగా దిగజారిపోయాడు. తెలిస్తే ఏమయిపోతాడో! నిర్ఘాంత పోతున్నాను.

"అమ్మా..." పాప వంటింట్లో గుసగుసలాడుతూంది మారాం చేస్తూ.

''ఏమ్మో...'' అంటోంది శకుంతల మెల్లిగా గొంతు తగ్గించి.

''మరేం... మరేం...''

''ఏవిటమ్మా?''

''రేపే కట్టాలమ్మా పరీక్ష ఫీజు... పరీక్షకి కూచోనివ్వరట... అందరూ నావేప దోలా చూస్తున్నా రమ్మా...''

''ఫరవాలేదమ్మా... రేపటిదాకా టైముందిగా... కట్టేద్దాంలే...'' కూతుర్ని బుజ్జగించింది శకుంతల.

పాప తిరిగి వచ్చి పుస్తకం పట్టుకుంది. సాంబం ఏదో చెబుతున్నాడు. తల దువ్వుకుని, పౌడరు రాసుకుని, చాకింత నేతచీర కట్టుకుని నిండుగా కళకళలాడుతూ ఒక చేత్తో పైట మూసుకుంటూ, మరో చేత్తో కాఫీ పట్టుకువచ్చింది శకుంతల.

''ఎలా మింగమంటారీ విషాన్ని?'' అన్నాను శకుంతల మొహంలోకి పట్టి పట్టి చూస్తూ.

ఒక్కమారు కళకళపడింది. నిలదొక్కుకుని – ''ఇంతకన్న మంచి కాఫీ ఇవ్వలేను... దయచేసి మింగండి'' అని మాట మారుస్తూ – ''మా కోసం... కాలకూటం వేనా దిగమింగాలి మరి'' అని చూసీ చూడనట్టు వాలుచూపు చూసి కనురెప్పలు దించేసుకుంది.

ఆ రెప్పలు డొప్పలలాగ దోసిలిపట్టీ దీనాతిదీనంగా అర్థిస్తున్నాయి. ఏదో చెబుతున్నాయి. ఏదో వర్షిస్తున్నాయి.

''పాప ఏం చదువుతోందీ?'' అన్నాను కాఫీ కప్పు కింద పెడుతూ.

''మెట్రిక్కు... మాలాగా కాదులేండి... చదువుంటే దానికి తిండే అక్కర్లేదు'' అంది శకుంతల పాప వేపు చూసి నవ్వుతూ.

పాప సిగ్గుపడి పుస్తకంలో కూరుకుపోయింది.

''ఉంచండి... పాప చదువుకి పనికొస్తుంది..'' అని పర్సు తీసి నోట్లు శకుంతలకి ఇవ్వబోయాను. ఒక్క మారు నివ్వెరబోయింది.

''అంత పీకల మీదకు వస్తే మీరే సర్దాలి మరి... నా కివాళ సాయంత్రం డబ్బుందుతుంది లెండి... మీ కెందుకు శ్రమ... నేనింకా బాగానే ఉన్నానుగా'' అని నవ్వేసి మొహం తిప్పుకుంది శకుంతల. కళ్లు ఒత్తుకుంటోంది.

నా గుండె కలుక్కుమంది. అది నవ్వు కాదు – కాలకూటం సెగ, విషాదం వెక్కిరింత.

''వద్దులేరా ... దాని చదువవగానే ఏదేనా ఉద్యోగం ఇప్పించు... అంతే చాలు'' అన్నాడు సాంబం.

''బాగుంది బాగుంది... వాళ్లావిడికి ఉద్యోగవేం కర్మవండీ'' అంది శకుంతల నవ్వుతూ.

పాప మొహం ముడుచుకుని లోపలికి పారిపోయింది. చిమ్మచీకటిలో గుడ్డి వెన్నెలలా ఆ క్షణం మా మొహాల మీద చిన్న నవ్వు వెలిగింది. అంతలో ''కారొచ్చింది. బాబూ'' అన్నాడెవరో తెల్ల యూనిఫారమ్‌లో డ్రైవర్ వచ్చి.

''ఇదిగో వచ్చేస్తున్నాను... ఒక్క నిమిషం'' అంటూ లేచి ఖాళీ కప్పు పట్టుకుని వంటింట్లోకి వెళ్లి తిరిగివచ్చి – ''పాపా! ముక్కలు తరిగే పెట్టేసు.. తల్లీ వేసేస్తావు కదూ? నాన్నారి ముందు జావా టైమ్ చూసుకోవాలి సుమా... కొంచెం లేటవుతుందమ్మా'' అని పాపకి పనులు పురమాయించి, పాప సరేనని తల ఊపిన తరువాత సాంబం వేపు తిరిగి, ''వెళ్లిరానా?'' అంది శకుంతల.

''వెళ్లు, వెళ్లు, జాగర్త సుమా...'' అని కూర్చునే సాగనంపాడు సాంబం.

''దయమాత్రం ఉంచండి..'' అని వెళుతూ వెళుతూ నా వేపు తిరిగి, గొంతు కొంచెం వణుకుతుండగా ''కుడితిలో పడ్డ ఎలకలం... వస్తూ పోతూ ఉండండి... మీరే మాకున్న బంధువులు'' అని నా మొహంలోకి చూసింది.

చెమ్మగిలి ఎర్రబారుతున్నాయి కళ్లు. అర్థం చేసుకోమని ప్రాధేయ పడుతున్నాయి.

''మందుమాట మరచిపోకు... చీటి పట్టుకెళుతున్నావా?'' అని తన మందు మాట జ్ఞాపకం చేశాడు సాంబం.

''అమ్మా... నా పరీక్ష ఫీజు'' అన్నట్టు మూగ చూపులు చూస్తోంది పాప.

''అమ్మా, అమ్మా... నాకు... నాకు మరేం... చాక్లేట్లు తేవా?'' అని మారాం చేశాడు చంటివాడు.

మధ్యవాడు లెక్కల్లో మునిగిపోయాడు.

''అన్నీ తెస్తాన్రా... ఎవర్నీ మరచిపోలేదు'' అంటూ చంటివాడి దిసిమొల వేపు బాధగా చూసి, మళ్లీ నా వేపు తిరిగి, ''మాకోసం మీరింత దూరం వస్తే.... నేను వెళ్ళిపోతున్నాను... మరో దిక్కు లేదు. మన్నించండి'' అంటూ చేతులు జోడించి గబగబా మేడదిగి వెళ్ళిపోయింది శకుంతల.

''ఆడా మగా రెక్కలు కొట్టుకున్నా గాని గడవని రోజులు... గడ్డు రోజులు. ఎందుకూ కొరగాని వాణ్ణయిపోయేను. నా కర్మ... దిక్కులేదు మరి... నాతో చెప్పకుండా గడప దాటదు గదా... ఏవీ చెయ్యదు గదా... దేవతరా..'' అని నా మొహంలోకి చూసి హఠాత్తుగా ఆగిపోయి, ''మా బతుకు లింతేరా మరీ... బురదలో మురిగిపోతున్నాం...'' అన్నట్టు నా కళ్లలోకి జాలిగా, బాధగా చూశాడు సాంబం.


కళ్లు తుడుచుకుంటున్నాడు. మేడ మీద వసారాలోకి వెళ్లి రోడ్డు మీదికి చూశాను. డ్రైవర్ కారు తలుపు తెరిచి పట్టుకున్నాడు. కుచ్చెళ్లు సర్దుకుంటూ కార్లో కూర్చుని తలుపు వేసుకుంది శకుంతల. నల్లకారు, అంబాసిడర్. ఇంకా అనుమానంగా చూశాను.

నవ్వలేక వెర్రి మొహం వేస్తున్నాడు. మూతి వంకరబోతూంది. కళ్ల నీళ్లు గక్కుతున్నాయి. నా మొహం చూడలేక బుర్ర దించేసుకున్నాడు. తెల్లబోయాను. ఆ కారు!... ఆ కారు.. హోటల్ ఊర్వశిది.

*

*(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 24-2-1971)*

## నౌఖరుకి కూడా నవాబు దర్జాయే!



ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారు, ఆయన బిరుదుకి తగ్గట్టు సింహంలాంటి వారు. ఉన్న రోజున దర్జాగా వుండడం, లేని రోజున మౌనంగా ఊరుకోవడమే కాని 'దేహి' అని ఎవర్నీ అడగలేదు ఆయన.

ఆ రోజుల్లో లక్షల విలువ చేసే ఆస్తిని దేశసేవ కింద ఖర్చు పెట్టి మిగిలింది కాస్త 'స్వరాజ్య' పత్రిక నిర్వహణలో వెచ్చించారు. అవి ఆయన స్వరాజ్య పత్రిక నడుపుతూన్న రోజులు. అప్పటికింకా ఆయనకీ పట్టాభి సీతారామయ్యగారికీ పంతాలూ పట్టింపులూ ప్రారంభం కాలేదు.

ఓ రోజు సాయంత్రం ఏడుగంటల ప్రాంతంలో ఆయన స్వరాజ్య పత్రిక ఆఫీసులో కూర్చుని పని చేసుకుంటూంటే, మద్దూరి అన్నపూర్ణయ్య గారు వచ్చారు. పంతులుగారి నౌఖరు ఆయనకు ఎదురెళ్లి ''అయ్యా! పంతులుగారు ప్రొద్దున్న కూర్చున్నారు కుర్చీలో – ఇంతవరకూ లేవలేదు'' అన్నాడు. అన్నపూర్ణయ్యగారు ''ఆహా'' అని, ఏం మాట్లాడకుండా వెళ్లి ఇంకో కుర్చీలో కూర్చున్నారు.

ఇంకో అరగంటకి పట్టాభిగారు వచ్చారు. నౌఖరు ఆయనకు కూడా ఎదురెళ్లి ఇందాక చెప్పిన మాటలు చెప్పి ''అన్న పూర్ణయ్యగారికి చెప్పానండీ. ఆయన ఏం మాట్లాడకుండా వెళ్లి కూర్చున్నారండీ'' అన్నాడు.

''అలాగా? అయితే రెండు భోజనం కేరియర్లు పట్రా'' అన్నాడు పట్టాభి.

అన్నపూర్ణయ్యగారు ''అదేమిటి?'' అని అడిగారు.

''అవును మరి – ప్రొద్దుటి నుంచీ ప్రకాశంగారు భోజనం చెయ్యలేదంటే మీరు ఊరుకున్నారు కదా. అంటే మీ దగ్గర కూడా డబ్బులు లేవన్న మాటేగా?'' అన్నారు.

అన్నపూర్ణయ్యగారు గుండెలు బాదుకుని ''ఆ నౌఖరు మాటలకి అర్థం ఇదా. నాకు చెబితే నేనే తెప్పిద్దును ఆయనకి కేరియర్'' అన్నారు. దానికి పట్టాభిగారు నవ్వి ''వాడు పంతులుగారి నౌఖరు. ఆయనలాగే వాడూ గంభీరంగానే ఉంటాడు'' అన్నారు.

''ఎంత గుంభనంగా చెప్పాడు ఆయన భోజనం చెయ్యలేదని? ఓరి వీడి గుంభనం బంగారం గానూ! సింహం దగ్గర మసలే మేకలు కూడా సింహం లాగా దర్జాగా ప్రవర్తిస్తాయన్నమాట'' అని విస్తుపోయారు అన్నపూర్ణయ్యగారు.